క్లుప్తంగా

వాటర్ ఫిల్టర్ వితరణ



వాటర్ ఫిల్టర్‌ను అందజేస్తున్న దృశ్యం

గార: శ్రీకూర్మంలోని నవజీవన ఆశ్రమానికి దివంగత వైస్ ఎంపీపీ బరాటం రామశేషు పేరిట కుటుంబ సభ్యులు రూ. 40 వేలు విలువ చేసే వాటర్‌ఫిల్టర్‌ను శుక్రవారం అందజేశారు. కొన్నేళ్లుగా పేదలకు ఆశ్రమం ద్వారా సేవలందిస్తున్నారని, ఇక్కడ విద్యార్థులకు శుద్ధ జలం అందించాలన్న ఉద్దేశంతో అందిం చామని వైఎస్సార్ సీపీ నాయకుడు బరాటం నాగేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో బరాటం శ్రీధర్, అందవరపు బాలకృష్ణమూర్తి, పల్ల రాధాకృష్ణ, ఊట అప్పలనాయుడు, రెల్ల నర్సింహులు, పల్ల శ్రీను, రాణ గురయ్య పాల్గొన్నారు.

ఆవులు పట్టివేత

శ్రీకాకుళం రూరల్: కోటబొమ్మాళి మండలం నారాయణవలస సంత నుంచి విశాఖపట్నంలోని కబేళాలకు ఆవులను అక్రమంగా తరలిస్తుండగా శుక్రవారం పెదపాడులోని పరిసర ప్రాంతంలో శ్రీకాకుళం రూరల్ పోలీసులు మాటువేసి పట్టుకున్నారు. ఇందులో ఏడు ఆవులు, ఒక దూడ ఉన్నట్లు రూరల్ ఎస్ఐ రాము తెలిపారు. ఆవులు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. పట్టుబడిన ఆవులను విజయనగరంలోని గోశాలకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఫైర్ అడిషనల్ డీజీని కలిసిన ఎస్పీ



మాదిరెడ్డి ప్రతాప్‌కు పూలమొక్క అందజేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకు రాష్ట్ర విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ శుక్రవారం రాత్రి విచ్చేశారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ గెస్ట్‌హౌస్‌లో రాత్రి బస చేశారు. శనివారం మూలపేట పోర్టును సందర్శించనున్నారు. ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి జడ్డు మోహనరావు, ఏఎస్పీ ఎఫ్‌వో శ్రీను బాబు మర్యాదపూర్వకంగా కలిశారు.

క్రైస్తవ బరియల్ గ్రౌండ్ నూతన కార్యవర్గం

శ్రీకాకుళం కల్చరల్: మండల పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ అత్యవసర సమావేశం స్థానిక తెలుగు బాప్టిస్టు చర్చిలో శుక్రవారం జరిగింది. సమావేశంలో సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ వద్దగల క్రైస్తవ సమాధుల తోట (బరియల్ గ్రౌండ్) కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా డి.బి.డి.బి.కుమార్, ఉపాధ్యక్షులుగా బిషప్ కె.ఫిలిప్, కార్యదర్శి రెవ.కె.మోషే, ఉప కార్యదర్శి కె.సూర్యనారాయణ, కోశాధికారి రెవ.ఎల్. ప్రకాశరావు, ఉప కోశాదికారి ఎన్ ప్రసాదరావు, సభ్యులుగా ఏపీ సాల్మన్‌రాజు, పాస్టర్ కె.శ్రీను, పాస్టర్ పి.తిమోతి, పాస్టర్ ముల్లర్‌జార్జ్, పాస్టర్ కె.సంసోను, రెవ.కె.జాషువా, పాస్టర్ కె.డేనియల్, పాస్టర్ కె.కొర్నేలి, పాస్టర్ ఫిలోమోనులను ఎన్నుకొన్నట్లు బిషప్ పి.కృపానందం, ఉపాధ్యక్షులు డీబీడీబీ కుమా తెలిపారు.

నేడు మహా రక్తదాన శిబిరం

శ్రీకాకుళం అర్బన్: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా మాజీ సైనికుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో శనివారం శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో మహా రక్తదాన శిబిరం, మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నారు. సంఘ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు.

జూదరుల అరెస్టు

రణస్థలం: మండలంలోని దేవరాపల్లి గ్రామ సమీపంలో జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను పట్టుకున్నామని జే.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి శుక్రవారం తెలిపారు. మరికొంత మంది పారిపోయారన్నారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.12,420 నగదు, నాలుగు బైకులు, నాలుగు ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోద చేశామన్నారు.

భూ పట్టాలు మంజూరు చేయాలి

రణస్థలం: పేదల సాగులో ఉన్న ప్రభుత్వ భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరాపు సింహాచలం, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎచ్చెర్ల మండలంలోని జాలారి కొయ్యాంలో పేదల అనుభవంలో ఉన్న 40 ఎకరాల ప్రభుత్వ భూమి (గయాలు)లో నీలగిరి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సింహాచలం, తేజేశ్వరరావు మాట్లాడుతూ.. నిరుపేదలైన మత్స్యకారులు, ఇతర కులాలకు చెందిన పేదలు సెంటు భూమి లేక కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. కుటుంబాలను విడిచిపెట్టి సుదూర ప్రాంతాలకు బతుకుదెరువు కోసం వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సముద్ర తీర ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములపై కొంతమంది పెత్తందారులు, భూస్వాములు కన్నేశారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిరుపేదలైన మత్స్యకారులకు ఆ భూములను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు.



కోదండరామాలయంలో ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మి



బలగ అయ్యప్ప ఆలయంలో పూజలందుకున్న మహాలక్ష్మి



బొందిలీపురంలో తుల్జాభవానీ అమ్మవారు



సంతోషిమాతను దర్శించుకుంటున్న భక్తులు

ఆలయాలకు శ్రావణశోభ



బలగ బాలత్రిపుర పీఠం దేవాలయంలో పూజలు



మొండేటివీధిలో సామూహిక కుంకుమ పూజలు



సంతోషిమాతకు పూజలు చేస్తున్న దృశ్యం



నక్కవీధిలో ఉమాదేవి అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్: శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలు, ఇళ్లల్లో శ్రావణ లక్ష్మి పూజలను భక్తిశ్రద్ధలతో చేశారు. పూజా మందిరాలను పూలతో, రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం తలకు స్నానాలు చేసి పట్టు చీరలు ధరించి భక్తితో ప్రత్యేకంగా శ్రావణలక్ష్మికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయాలకు వెళ్లి అమ్మవారికి కుంకుమార్చనలు, శ్రీచక్రార్చనలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాలు మహిళా భక్తులతో సందడిగా మారాయి. పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత అమ్మవారి ఆలయంలో అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఉషఃకాలార్చనలు, బాల భోగసేవ, శ్రీచక్రార్చనలు నిర్వహించారు. దేవదాయశాఖ ఈవో సుకన్య ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. శ్రీకోదండ రామాలయంలోని శ్రీమహాలక్ష్మికి, బలగ అయ్యప్ప స్వామి ఆలయంలోని శ్రీమహాలక్ష్మికి విశేష పూజలు నిర్వహించారు. నక్కవీధిలోని ఉమాజఠలేశ్వర దేవాలయంలో ఉమాదేవికి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమపూజలు జరిగాయి. మొండేటివీధిలోని లలితా సమేత శివ కామేశ్వరస్వామి ఆలయంలో లలితా దేవికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

సంక్షేమానికి కూటమి ప్రభుత్వం తూట్లు



అల్లివలసలో చంద్రబాబు మోసాలు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

రణస్థలం: కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలకు తూట్లు పొడవడంతో ప్రజలకు కష్టాలు మొదలయ్యాయని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కోటపాలెం, అల్లివలస గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ప్రజలకు వీడియో రూపంలో వివరించారు. చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు అవుతోందన్నారు. కూటమి ప్రభుత్వ ఏర్పడిన ఏడాదికే ప్రజల చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మైలపల్లి లక్ష్మీకామరాజు, రాష్ట్ర యువజన విభాగం సంయక్త కార్యదర్శి పిన్నింటి సత్యంనాయుడు, ఎస్సీ సెల్, బీసీ సెల్ అధ్యక్షులు నేతల కృష్ణ, మజ్జి రమేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు మహంతి అప్పలనాయుడు, టేకు బ్రహ్మాజీ, జోగ శ్రీనివాసరావు, ఎంపీటీసీలు సుంకర కిశోర్, ఉప్పాడ అప్పన్న, సర్పంచులు గొర్లె రాధాకృష్ణ, గొర్లె జగదీష, చీకటి ఎర్రయ్య, నాయకులు గొర్లె తిరుపతి నాయుడు, మైలపల్లి వెంకటేష్, మాగుపల్లి సోమయ్య, లంక అప్పలనాయుడు, గొర్లె నాగభూషణ్ నాయుడు, వాసుపల్లి బుజ్జి, మాగుపల్లి పొట్టివాడు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే బాగుండేది



మాకు కూటమి ప్రభుత్వంలో ఇంతవరకు ఏ పథకమూ రాలేదు. నెలకు రూ.1500 ఇవ్వలేదు. ఏడాదికి రూ.18,500 అందలేదు. చెరువు పని డబ్బులు వెయ్యలేదు. జగనన్న ప్రభుత్వంలో అన్ని సంక్షేమ పథకాలూ అందేవి. మళ్లీ జగనన్నే రావాలి. – సూరాడ కాములమ్మ, అల్లివలస, రణస్థలం మండలం

‘త్వరలోనే ఆదిత్యాలయంలో పోస్టుల భర్తీ’



మంత్రి ఆనంకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ ప్రసాద్, ప్రధానార్చకులు శంకరశర్మ

అరసవల్లి: దేశంలోనే ప్రఖ్యాతి గాంచిన అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో త్వరలోనే ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేస్తామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటించారు. శుక్రవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి అరసవల్లి ఆదిత్యుడిని దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ అరసవల్లి ఆలయంలో పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వీటిపై నెలరోజుల్లో సమగ్ర నివేదిక తయారు చేసి తనకు అందించాలని రీజనల్ జాయింట్ కమిషనర్ త్రినాథరావుకు ఆదేశించారు. ఆలయంలో పనిచేస్తున్న మంగళ వాయిద్యకారులు తమకు జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదని, ఔట్‌సోర్సింగ్ విధానంలో కాకుండా తమకు ఆలయం తరఫున నియామకాలు చేపట్టాలంటూ మంత్రికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ఇక్కడ మంగళవాయిద్య సిబ్బందికి భూములిచ్చిన సంగతిని గుర్తుచేస్తూ జీతాల సమస్యలను పరిష్కరించే మార్గాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, దేవదాయ శాఖ ఆర్జేసీ త్రినాథరావు, డిప్యూటీ కమిషనర్ సుజాత, స్థానిక డివిజన్ల ఇన్‌ఛార్జిలు తెలుగు నాగరత్నం, ఉంగటి వెంకటరమణ, ఉంగటి పాపారావు, రాయిపల్లి అర్జున్ తదతరులు పాల్గొన్నారు.

‘సాక్షి’ కథనంపై మంత్రి ఆనం ఆరా

మంత్రి ఆనం తొలిసారిగా ఆదిత్యుడిని దర్శించుకుంటున్న సందర్భంగా మంత్రికి ‘సమస్యల స్వాగతం’ పేరిట సాక్షిలో ప్రత్యేక కథనాన్ని శుక్రవారం ప్రచురించిన సంగతి విదితమే. ఆలయ పర్యటనకు వస్తున్న క్రమంలోనే ఈ కథనంపై మంత్రి ఆనం ఆరా తీశారు. మాస్టర్ ప్లాన్ అంశం, విజిలెన్స్ విచారణలతో పాటు ఆలయంలో జరిగిన అక్రమాలు, ఉద్యోగుల సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే శంకర్‌తో మంత్రి చర్చించారు.

కూటమి పాలనలో భరోసా కరువు



బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు



బూరవెల్లిలో చంద్రబాబు మోసాలతో కూడిన క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ రఘురామ్, నాయకులు

గార: కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు భరోసా కరువయ్యిందని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. బూరవెల్లి, పూసర్లపాడు గ్రామాల్లో ‘బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ’ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలకు క్యూఆర్ కోడ్ ద్వారా చంద్రబాబు ఇచ్చిన హామీల వివరాలను చూపించారు. ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ హామీలిచ్చిన చంద్రబాబు వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నాడన్నారు. రైతులకు, తల్లిదండ్రులకు ఏడాది పాటు పైసా ఇవ్వకుండా మాటలతోనే కాలయాపన చేశారన్నారు. ఇప్పటికీ ప్రలోభాలతోనే కాలం వెల్లదీస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మార్పు దుర్గా పృథ్వీరాజ్, నాయకులు అరవల రామకృష్ణ, మళ్ల చిననారాయణమూర్తి, యాళ్ల నారాయణమూర్తి, తమ్మిన అప్పలరాజు, బరాటం నాగరాజు, గుజ్జల అప్పలరాజు, తెనుకోటి అప్పారావు, అరవల నర్సింగరావు, ఊటపల్లి కాశీరావు, అరవల రామారావు, గదిలి సుందరరావు, మళ్ల చిట్టిబాబు, మళ్ల నర్సింహమూర్తి, మాధవనాయుడు, జగన్ పాల్గొన్నారు.

అంబళ్లవలస, బోరవానిపేటలో..

చంద్రబాబు ఏడాది పాలన మోసాలమయమని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి అన్నారు. అంబళ్లవలస, బోరవానిపేటలో మండల పార్టీ అధ్యక్షుడు పీస గోవిందరాజులు అధ్యక్షతన కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ఇంకా అన్నదాత సుఖీభవ ఇవ్వకుండా రైతులను మోసగించడం సరికాదన్నారు. వితంతు పింఛన్ల కోసం వేలాది మంది ఎదురుచూస్తున్నారన్నారు. ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల కాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి, సర్పంచ్ అరవల రామారావు, అందవరపు బాలకృష్ణమూర్తి, కొయ్యాన నాగభూషణం, అరవల చిన్నప్పారావు, గొండు జయరాం, పొదిలాపు రామజోగి, రాజేశ్వరరావు, బోర రమణయ్య, దుడ్డు అప్పన్న ఉన్నారు.

గురుకులాలను పర్యవేక్షించాలని వినతి



కలెక్టర్‌ను కలిసిన దళిత సంఘాల నేతలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ని ఆయన చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గురుకులాలను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని కోరారు. గురుకులాల్లో ఇదివరకు ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలు తెరవనే లేదని తెలిపారు. భవనాల కొరత సమస్య పరిష్కరించాలని కోరారు. అమ్మాయిల గురుకులాల్లో పురుష ఉద్యోగులు ఉండకూడదన్న నిబంధనలు ఉన్నా అవి అమలు కావడం లేదన్నారు. కాయకూరలు గుడ్లు, చికెన్ నాసిరకంగా ఉంటున్నాయని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్ దుర్గాసి గణేష్, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్కా కృష్ణయ్య, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు లోపింటి తేజేశ్వరరావు, నగర అధ్యక్షుడు కానుకుర్తి గోవింద్ జిల్లా ఉపాధ్యక్షుడు దీర్ఘాశి హరీష్ కుమార్, అధికార ప్రతినిధి కంటిపాక హిమశేఖర్, మాలమహానాడు జిల్లా నాయకులు ముచ్చ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త ఆవిష్కరణలు చేయండి



స్టీమ్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డీఈఓ తిరుమల చైతన్య

రణస్థలం: విద్యార్థులు రోబోటిక్స్, ఏఐ వంటి అంశాలను నేర్చుకోవాలని, సరికొత్త ఆవిష్కరణలకు కృషి చేయాలని డీఈఓ ఎస్.తిరుమల చైతన్య సూచించారు. మండల కేంద్రంలోని ఐరిస్ సౌకల్య పాఠశాలలో స్టీమ్ ల్యాబ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కూడా అటల్ టిక్కరింగ్ ల్యాబ్స్ ద్వారా విద్యార్థులకు రోబోటిక్స్‌పై విద్యార్థులకు బోధన అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కుమారస్వామి, ఎంఈఓ త్రినాథరావు, ఐరిస్ కరస్పాండెంట్ కె.హరికృష్ణ, అప్సా నియోజకవర్గ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, న్యూ రే ఎనర్జీ సొల్యూషన్స్ ప్రోగ్రాం కోర్డినేటర్ సంతోష్, ప్రాణిగ్రహి, కళా వెంకటరావు, యూలో పబ్లికేషన్ ప్రతినిధులు నాయక్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత నాయకుడు చంద్రబాబు



శ్రీకాకుళం రూరల్: బైరిలో ప్రచారం చేస్తున్న నాయకులు

శ్రీకాకుళం రూరల్: ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసే ముఖ్యమంత్రి చంద్రబాబు అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దుయ్యబట్టారు. పొన్నాం, బట్టేరు, కరజాడ, బైరి, వప్పంగి గ్రామాల్లో ‘బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ’ కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షులు చిట్టి జనార్దనరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలతో కూడిన క్యూఆర్ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి నిర్మల, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మూకళ్ల సుగుణ, పార్టీ సీనియర్ నాయకులు అంబటి శ్రీనువాసరావు, చల్లా రవికుమార్, మూకళ్ల తాతబాబు, బొడ్డేపల్లి రమేష్, దుంపల శ్యామలరావు, కంచు వసంతరావు, రుప్ప అప్పలసూరి, గొండు క్రిష్ణ, బాణ్న నర్సింగరావు, బగ్గురు అప్పారావు, ధర్మాన గిరి, చింతాడ వెంకటరమణ, సాధు కామేశ్వరి, రావాడ మోహన్, ఎచ్చెర్ల శ్రీధర్, నీలంశెట్టి రామక్రిష్ణ, సాధు మురళీ, గుండ హరేష్, బాణ్న శ్రీను, కొంక్యాన గోవిందరావు, కర్రి రామినాయుడు, చిన్నారావు, తంగి అప్పన్నస్వామి పాల్గొన్నారు.

మోసకారి బాబును సాగనంపాలి



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎన్నికల హామీలను అమలు చేయకుండా విస్మరించిన చంద్రబాబుకి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ తూర్పుకాపు కుల రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని 20వ డివిజన్ వానపల్లి రమేష్, ఇన్‌చార్జి గంగాధర్, అప్పలచారి ఆధ్వర్యంలో పాదాలమ్మ చెట్టు, శ్రీరామ మందిరం, భద్రమ్మ గుడి ప్రాంతాల్లో ‘బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ’ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ పార్టీ అధ్యక్షులు సాధు వైకుంఠరావు, పట్టణ బీసీ విభాగం అధ్యక్షులు గద్దిబోయిన కృష్ణారావు, అల్లు లక్ష్మీనారాయణ, బైరి మురళి, తోట తారక, మట్టా సూర్యనారాయణ, ఖాన్ కింజరాపు రమేష్,, జె.శ్రీనివాస్, రౌతు శంకర్, సీరా సత్యనారాయణ, రంగజీ దేవ్, చందు సీపాన మహేంద్ర, భారద్వాజ్, ఒ.శ్రీనివాస్, రుప్ప శ్రీను పాల్గొన్నారు.

నాచుతో మత్స్యకారులకు అదనపు ఆదాయం

రణస్థలం: సముద్రతీరం వెంబడి మత్స్యకారులంతా సీవీడ్ (సముద్రపు నాచు)ను ఉత్పత్తి చేయటంతో అదనపు ఆదాయం పొందవచ్చని జిల్లా మత్స్యశాఖ ఉప సంచాలకులు వై.సత్యనారాయణ అన్నారు. ఎచ్చెర్ల మండలంలోని బుడగట్లపాలెం సముద్ర తీరంలో ఇటీవల సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా పైలట్ కార్యక్రమంగా సీవీడ్‌ను మత్స్యకారులతో తయారు చేయించాలని ఆదేశించారు. దీంతో జిల్లా మత్స్యశాఖ అధికారులు ఈ ప్రాంతం మత్స్యకారులతో తయారు చేయిస్తున్నారు. సీవీడ్ తయారీపై జిల్లాలో సోంపేట మండలం బారువ, సంతబొమ్మాళి మండలం భావనపాడు ప్రాంతాల మత్స్యకారులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సముద్రం నాచు వలన కలిగే ప్రయోజనాలు, వాణిజ్యపరంగా దీని ప్రాధాన్యత, సాగు చేసే విధానంపై అవగాహన కల్పించారు.

మత్తు మందుల విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

- డ్రగ్ ఏడీ చంద్రరావు



కెమిస్టులతో సమావేశమైన డ్రగ్స్ ఏడీ చంద్రరావు

శ్రీకాకుళం క్రైమ్: నిద్ర సరిగ్గా రానివారికి మెడికల్ షాపుల్లో దొరికే మత్తు మందుల విక్రయాల్లో సంబంధిత నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, వైద్యులు ఇచ్చే ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయించే షాపులపై కఠినంగా వ్యవహరిస్తామని జిల్లా ఔషధ నియంత్రణ కార్యాలయ సహాయ సంచాలకులు (డ్రగ్ ఏడీ) చంద్రరావు స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని కత్తెర వీధిలో జిల్లా కెమిస్టు అసోసియేషన్ బిల్డింగ్‌లో అపోలో, మెడ్‌ప్లస్, మరికొన్ని సంస్థలకు చెందిన కెమిస్టులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాపుల్లో తప్పనిసరిగా ఫార్మాసిస్టులు ఉండాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు మందుల షాపుల నుంచి రెండు సంవత్సరాలుగా 348 నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపి నాణ్యతా పరీక్షలు జరిపామని, విఫలమైన ఏడు తయారీ సంస్థలపై క్రిమినల్ కేసులు కట్టామన్నారు. ఒక మందును చట్టపరమైన ల్యాబ్‌లో పరీక్షించకుండా నాసిరకం అని చెప్పలేమని, ప్రస్తుతం జిల్లాలో 44 కేసులు వివిధ కోర్టుల్లో నడుస్తున్నాయన్నారు. అల్లోపతి మందులను ప్రభుత్వం నిర్ధేశించిన ధరలకు ప్రజలకు ఇవ్వాలని, వినియోగదారులు సైతం నిబంధనలకు అనుగుణంగా వైద్యులు ఇచ్చే ప్రిస్క్రిప్షన్ ఆధారంగానే మందులు అడగాలన్నారు. షాపువారిపై ఒత్తిడి చేయరాదని, యాంటీబయోటిక్ మందులను డాక్టర్లు చెప్పేటట్లు ఫుల్‌కోర్స్ వాడాలని, మధ్యలోనే ఆపేయరాదన్నారు.